క్లుప్తంగా

టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీ



మంగళగిరి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గుంటూరు ఆర్‌టీఏ ఆధ్వర్యంలో మంగళగిరి–తాడేపల్లి కార్పొరేషన్ పరిధి కాజ టోల్‌ప్లాజా వద్ద శుక్రవారం రాత్రి రవాణాశాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. డీటీసీ షేక్ కరీం ఆధ్వర్యంలో ఆర్‌టీఓ గోపాల్ ప్రసాద్, ఎంవీఐలు రాఘవరావు, అనిల్‌కుమార్, మల్లీశ్వరి, సంధ్య కాంటాక్ట్ క్యారేజి బస్సులు, కంటైనర్ లారీలను ఆపి వాటిలోని సరుకులను తనిఖీ చేశారు. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా ఏవైనా సరుకులు రవాణా చేసినట్లయితే కేసులు నమోదు చేయడంతో పాటు సీజ్ చేయడం జరుగుతుందని రవాణా శాఖ అధికారులు బస్సు డ్రైవర్లను హెచ్చరించారు.

అనంతవరంలో వలంటీర్లు రాజీనామా



తాడికొండ: తుళ్లూరు మండలం అనంతవరంలో శనివారం పది మంది వలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పేదలకు సేవచేసే భాగ్యం తమకు కలుగజేస్తే పేదలకు పింఛన్లు పంపిణీ, ఇతర సేవలు అందించకుండా వలంటీర్లపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు చేసి అడ్డుకున్న చంద్రబాబును ఈ ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడించి మళ్లీ విధుల్లో చేరుతామన్నారు. స్వచ్ఛంద సేవకులుగా వలంటీర్లు చేస్తున్న సేవలకు మాకు మంచి ఆదరణ లభిస్తుంటే ఓర్వలేక బాబు దుర్మార్గ ప్రచారాలు చేశాడని, మళ్లీ జగనన్నను సీఎంగా గెలిపించుకొని ప్రజలకు సుపరిపాలన చేరువ చేస్తామన్నారు.

వైభవంగా శీతలాంబదేవి ఆలయ వార్షికోత్సవం



ఫిరంగిపురం: మండలంలోని వేమవరం గ్రామం సెంటర్‌లోని శీతాలాంబదేవి ప్రతిష్ట 32వ వార్షికోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే గ్రామస్తులు బిందెలతో నీటిని తెచ్చి శీతలాంబ అమ్మవారికు అభిషేకం నిర్వహించారు. అనంతరం పూలతో అలంకరించి పసుపు, కుంకుమలతో అష్టోత్తర, సహస్రనామ పూజలు చేశారు. పొంగళ్లు పొంగించి, కొబ్బరికాయలు కొట్టి విశేష అర్చనలు చేశారు.

230 మందికి వైద్య పరీక్షలు



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని సచివాలయం–2 పరిధిలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా ఫిరంగిపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. 230 మందికి వైద్యురాలు శ్వేత వైద్య పరీక్షలు చేసి నెలకు సరిపడా మందులు అందజేశారు. వేసవిలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. రెండు గంటల ఒకొసారి మంచి నీరు తీసుకోవాలని సూచించారు. మధ్యాహ్నం సమయంలో తలపై ఎటువంటి వస్త్రం లేకుండా బయటకు వెల్లవద్దన్నారు. వడదెబ్బ తగలకుండా పండ్లరసాలు, గ్లూకోస్ వంటివి. కొబ్బరినీరు తీసుకోవాలని చెప్పారు. ప్రతి గ్రామంలోని సబ్ సెంటర్, లేదా ఆశాకార్యకర్తల వద్ద ఓఆర్ ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ వెంకటరమణ, హెచ్‌వీ అన్నమేరి పాల్గొన్నారు.

ప్రజ్ఞాచారికి డాక్టరేట్



తెనాలిరూరల్: తెలుగు భాషకు సుదీర్ఘ కాలంగా తన వంతు సేవ చేస్తూ తనదైన ప్రత్యేకతను కనబరిచిన తెనాలి మండలం కొలకలూరు గ్రామానికి చెందిన సాహితీ రత్న నూతక్కి పూర్ణ ప్రజ్ఞాచారి గౌరవ డాక్టరేట్ అందుకోనున్నారు. ఈ మేరకు హైదరాబాద్‌కు చెందిన తెలుగు సంస్కృతి సాహితీ సేవా సంస్థ చైర్మన్ ఏఎంజీ శంకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28వ తేదీన హైదరాబాద్ చిక్కడ్‌పల్లి త్యాగరాయ గాన సభ వేదికపై కవులకు గౌరవ డాక్టరేట్ ఇవ్వనున్నామని, దీనిలో భాగంగా అంతర్జాతీయ స్థాయిలో కవిగా గుర్తింపు తెచ్చుకున్న పూర్ణ ప్రజ్ఞాచారి సాహితీ సేవకు గుర్తింపుగా 2024 గౌరవ డాక్టరేట్‌కు ఆయనను తమ సంస్థ ఎంపిక చేసిందని తెలిపారు. ఈ సందర్భంగా పూర్ణ ప్రజ్ఞాచారి విలేకర్లతో మాట్లాడుతూ తన తండ్రి నూతక్కి అబ్రహాం అక్షర వారసత్వాన్ని కొనసాగిస్తూ రచనలు చేస్తున్నానని, ఇన్నాళ్ల తన శ్రమకు ప్రతిఫలంగా ఈ గౌరవ డాక్టరేట్ రావడంపై హర్షం వెలిబుచ్చారు.

ప్రజా సంక్షేమం జగనన్నతోనే సాధ్యం

- ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)
- వైఎస్సార్ సీపీ అభ్యర్థి మురుగుడు లావణ్య ఎన్నికల ప్రచారం
- పాల్గొన్న ఎమ్మెల్సీ మురుగుడు, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ అభ్యర్థి మురుగుడు లావణ్య, పక్కన ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల

మంగళగిరి: రాష్ట్రంలో ప్రజా సంక్షేమం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే సాధ్యమని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) అన్నారు. శనివారం ఆయన ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల, వైఎస్సార్ సీపీ అభ్యర్థి మురుగుడు లావణ్యతో కలసి నగరంలోని శ్రీలక్ష్మీ నృసింహస్వామి కాలనీ, యర్రబాలెంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో స్థానిక నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం సమ దృష్టితో పాలన సాగిస్తూ, సచివాలయ వ్యవస్థతో అందరికీ ఆదర్శంగా నిలిచిన ముఖ్యమంత్రి జగనన్న అన్నారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి హయాంలో విద్య, వైద్య రంగాలు అభివృద్ధి చెందాయని చెప్పారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఓటు వేసి జగనన్నను ముఖ్యమంత్రిగా, మంగళగిరి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థిని మురుగుడు లావణ్యను ఎమ్మెల్యేగా గెలిపించాలని ఆయన కోరారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మునగాల మల్లేశ్వరరావు, ఆకురాతి రాజేష్. మాచర్ల సుధాకర్, సంకె సునీత, మల్లవరపు సుధారాణి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే సామాజిక న్యాయం

తాడేపల్లిరూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి పట్టణం ప్రకాష్‌నగర్ 7,9 వార్డులలో వైఎస్సార్ సీపీ నాయకులు జీలగ గాలయ్య ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారాన్ని శనివారం రాత్రి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జేసీఎస్ జిల్లా కో ఆర్డినేటర్ ఈదులమూడి డేవిడ్‌రాజు, పార్టీ పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ తరఫున గుంటూరు పార్లమెంట్ అభ్యర్థిగా కిలారి వెంకట రోశయ్య, మంగళగిరి ఎమ్మెల్యే అభ్యర్థిగా మురుగుడు లావణ్యను గెలిపించాలని కోరారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఇతర కులాల్లోని పేదలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నవరత్నాల పేరుతో సంక్షేమ పథకాలు అందించారని, సామాజిక న్యాయం జరగాలంటే జగనన్నను గెలిపించుకోవాలని కోరారు. సీఎం ప్రతి పేదవాడికి సొంత ఇల్లు ఉండాలని కార్పొరేషన్ ప్రాంతంలోని వారికి రాజధాని పరిధిలో ఇళ్ల స్థలాలు కేటాయిస్తే బడుగు బలహీన వర్గాలు అంతర్జాతీయ స్థాయి రాజధానిలో ఇలాంటి స్లమ్ ఉంటే సమాజ అసమతుల్యత ఏర్పడుతుందని కోర్టును ఆశ్రయించారని, ఇప్పుడు వారే 20 వేల ఇళ్లు ఇస్తామని అంటున్నారని, ఎక్కడ ఇస్తారో మీరు అడగాల్సి ఉందని చెప్పారు. కార్యక్రమంలో బూత్ కన్వీనర్లు శ్రీకాంత్, రాబర్ట్, కుమార్, మురళి, స్థానిక నాయకులు నాగేశ్వరరావు, మన్నయ్య, శేఖర్, రమేష్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమం ఘనత వైఎస్ జగన్‌దే

ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

తాడికొండ: అర్హులందరికీ సంక్షేమ అందించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని వైఎస్సార్ సీపీ అభ్యర్థి, ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత పేర్కొన్నారు. శనివారం తాడికొండ శివారు బడేపురం రోడ్డులోని బూర్ల కాలనీ, బీసీ కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఫ్యాను గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా కిలారి వెంకట రోశయ్యను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో అన్ని వర్గాలకు మేలు చేసిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌గా పేర్కొన్నారు. కులం, మతం, ప్రాంతం, పార్టీ భేదం లేకుండా అన్ని వర్గాలకు సమాన అధికారాలు, పదవులు అందించడం వలననే నేడు పేద వర్గాలకు రాజకీయంగా ఆర్థికంగా భారీ లబ్ధి జరిగిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించి అండగా నిలిచారని చెప్పారు. గత చంద్రబాబు ప్రభుత్వం జన్మభూమి కమిటీలను ఏర్పాటు చేసి టీడీపీ నాయకులకు అన్నీ కట్టబెట్టి పేదలకు మంగళం పలికినందుకే ప్రజలు బాబును తరిమికొట్టారని చెప్పారు. ప్రజలందరూ వైఎస్సార్ సీపీని ఆశీర్వదించి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచి తోకల సరోజినీ, వైస్ ఎంపీపీ రెడ్డి త్రివేణి, సొసైటీ చైర్మన్ షేక్ నగీనా, ఉప సర్పంచి ఉయ్యూరు వెంకటరెడ్డి, మాజీ సర్పంచి తుమ్మల రామస్వామిరెడ్డి, నిడుముక్కల సర్పంచి మాదాసు రత్నకుమారి, పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర రెడ్డి, రాష్ట్ర యువజన విభాగం నాయకుడు కల్లం హరికృష్ణారెడ్డి పాల్గొన్నారు.



కాలనీలో ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

నీటి కుంటలతో భూగర్భ జలాల పరిరక్షణ



గుండాలపాడులో ఉపాధి పనుల్లో కూలీలు

ఫిరంగిపురం: మండలంలోని 17 గ్రామాల్లో ఉపాధి హామీ పనులు వేగంగా సాగుతున్నాయి. పొలాల్లో నీటి కుంటల ఏర్పాటు చేయడంతో భూగర్భజలాల వృద్ధి చెంది పంటలకు ఉపయోగకరంగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు. వేసవిలో పశువులకు తాగునీటి కొరత అరికట్టవచ్చని వివరిస్తున్నారు. మండలంలో ఎనిమిది వేలమంది ఉపాధి కూలీలు ఉండగా శనివారం ఐదువేల 802 మంది పనులు చేస్తున్నారు. పంటకాలువల్లో పూడికతీత, చెరువులలో పూడికతీత, పొలాల్లో నీటి కుంటల తవ్వకాలు వంటి పనులు నిర్వహిస్తున్నారు. ఉదయం 6 నుంచి 10 గంటల వరకు పనులు నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ అధికారులు తెలిపారు. నిర్ణీత సమయం లేకుండా కేటాయించిన పరిధిలో పనిని నిర్వహించినందుకు రోజుకు రూ.300 కూలీగా నిర్ణయించినట్లు చెప్పారు. కూలీలు ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తకుండా అందుబాటులో మెడికల్ కిట్లు ఉంచినట్లు ఉపాధి హామీ పథకం అధికారులు వెల్లడించారు.

మూడో రోజు 21 నామినేషన్లు

మంగళగిరి: నియోజకవర్గంలో మూడో రోజు శనివారం నామినేషన్ల జోరు కొనసాగింది. మంగళగిరి అసెంబ్లీ స్థానానికి 15 మంది అభ్యర్థులు 21 నామినేషన్లను దాఖలు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి, జేసీ రాజకుమారి తెలిపారు. నవతరం పార్టీ తరఫున రావు సుబ్రహ్మణ్యం అత్యధికంగా మూడు సెట్ల నామినేషన్లను దాఖలు చేయగా పలువురు ఇండిపెండెంట్ అభ్యర్థులు తమ నామినేషన్లను దాఖలు చేసినట్లు ఆమె వెల్లడించారు.

ఐఎన్‌టీఎస్‌ఓలో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

మంగళగిరి: జాతీయ స్థాయిలో నిర్వహించే ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్(ఐఎన్‌టీఎస్‌ఓ) పరీక్షల్లో విజయవాడ జోన్ శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు ప్రతిభను కనబర్చినట్లు జోన్ ఏజీఎం మురళీ కృష్ణ తెలిపారు. శనివారం నగరంలోని తెనాలి రోడ్డులోని శ్రీ చైతన్య పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రతిభ కనబర్చిన విద్యార్థుల అభినందన కార్యక్రమం నిర్వహించారు. వివిధ విభాగాల్లో మొత్తం 195 మంది విద్యార్థులు బంగారు పతకాలు, ప్రశంసాపత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఏజీఎం మురళీ కృష్ణ మాట్లాడుతూ తరగతి గదుల్లో చదువుతో పాటు పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని, తద్వారా విద్యార్థులు బహుమతులు సాధిస్తున్నారని చెప్పారు. ప్రతి విద్యార్థి మొబైల్ ఫోన్, టీవీలకు దూరంగా ఉంటూ కేవలం చదువులపై మాత్రమే దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.కరుణాకర్, డీన్ వెంకటేశ్వర్లు, కోఆర్డినేటర్ చక్రధర్ ప్రసాద్, ఆర్ఐ రామారావు పాల్గొన్నారు.

డాక్టర్ మోహన్‌దాస్‌కు ఘన నివాళి



డాక్టర్ హరితకు బంగారు పతకాన్ని ప్రదానం చేస్తున్న వైద్యులు

తెనాలిరూరల్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) తెనాలి శాఖ ఆధ్వర్యంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ కొడాలి మోహన్‌దాస్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. బోసురోడ్డులోని ఐఎంఏ తెనాలి శాఖ కార్యాలయంలో శనివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో పలువురు వైద్యులు పాల్గొని డాక్టర్ మోహన్‌దాస్ సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో విజయవాడకు చెందిన ప్రశాంత్ హాస్పటల్ స్త్రీల వైద్య నిపుణురాలు డాక్టర్ పి.హరిత స్త్రీల గర్భకోశ వ్యాధులపై డాక్టర్ కొడాలి మోహన్‌దాస్ సంస్మరణ సభలో స్మారకోపన్యాసం చేశారు. డాక్టర్ హరితకు ఐఎంఏ సభ్యులు డాక్టర్ మోహన్‌దాస్ గోల్డ్ మెడల్‌ను ప్రదానం చేశారు. డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ కె.పావని ప్రియాంక, డాక్టర్ మాదల ప్రభాకర్‌బాబు, డాక్టర్ పి.దక్షిణామూర్తి, డాక్టర్ మస్తానమ్మ, డాక్టర్ అబ్బయ్య, డాక్టర్ జాస్తి భానుప్రసాద్, డాక్టర్ నరసింహారావు తదితర వైద్యులు పాల్గొన్నారు.

ఘనంగా వేణుగోపాలస్వామి ఆలయ వార్షికోత్సవం

మేడికొండూరు: మండల పరిధిలోని డోకిపర్రులో శ్రీరుక్మిణి సత్యభామ వేణుగోపాలస్వామి ఆలయ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. పూజల్లో మచిలీపట్నం పోర్టు ట్రస్ట్ డైరెక్టర్ మేకతోటి దయాసాగర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో రామకోటమ్మ, మండల నాయకులు ఉడతా శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, కిషోర్‌రెడ్డి, సాంబిరెడ్డి పాల్గొన్నారు.

రూ.66 వేలు స్వాధీనం

తాడికొండ: తుళ్లూరు మండలం రాయపూడి గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న రూ.66 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ ఈ అశోక్ గౌడ్ తెలిపారు. శనివారం ఉదయం రాయపూడి సీడ్ యాక్సిస్ రోడ్డు వై జంక్షన్‌లో తనిఖీలు నిర్వహిస్తుండగా ఎస్. సాంబశివ నాయుడు కారులో రూ.66 వేల నగదును తరలిస్తున్నట్లు గుర్తించారు. ఇందుకు సంబంధించిన రసీదులు చూపించక పోవడంతో నగదును సీజ్ చేసి ఐటీ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు.

కిట్స్‌లో ఏఐ, రోబోటిక్స్‌పై హ్యాకథాన్

36 గంటల నిర్వహణ



హ్యాకథాన్ ముగింపులో మాట్లాడుతున్న కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు

ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండలం వింజనంపాడులోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో కృత్రిమ మేధ (ఏఐ), రోబోటిక్స్‌పై 36 గంటల హ్యాకథాన్‌ను నిర్వహించారు. ఈ నెల 19, 20 తేదీల్లో సీఎస్‌ఈ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు జరిగిన హ్యాకథాన్‌లో బూట్‌క్యాంపు ద్వారా పలు సాంకేతిక విషయాలపై అవగాహన కల్పించారు. అదేవిధంగా నూతన సాంకేతిక పరిజ్ఞానం ద్వారా సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలు ఎలా అభివృద్ధి చేయాలన్న అంశాలను ఐడియాథాన్‌లో వివరించారు. కృత్రిమ మేధ, రోబోటిక్స్ ఉపయోగించి విద్యార్థులు 34 ఆవిష్కరణలకు ప్రొటోటైప్‌ను అభివృద్ధి చేశారు. ఐదుగురు జ్యూరీ సభ్యులతో కూడిన నిపుణుల బృందం ఐదు ఉత్తమ ఆవిష్కరణలను ఎంపిక చేయగా, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కె. సుబ్బారావు, సెక్రటరీ కె. శేఖర్, ఎస్.ఆర్.కె ఫౌండర్, హ్యాక్‌బోట్స్ సీఈవో మహేన్, గాకున్ టెక్నాలజీస్ సీఈవో, డైరెక్టర్ శరత్ వేదాల ప్రిన్సిపాల్ డాక్టర్. పి. బాబు, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్. కె. హరిబాబు, సీఎస్‌ఈ విభాగాధిపతి ప్రొఫెసర్ ఆర్. రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు 'గో టు హెల్' సాంఘిక నాటకం ప్రదర్శన



కరపత్రాన్ని ఆవిష్కరించిన సాయిమాధవ్ బుర్రా

తెనాలి: కళల కాణాచి–తెనాలి, వేద గంగోత్రి ఫౌండేషన్–విజయవాడ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం స్థానిక కొత్తపేటలోని తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో 'గో టు హెల్' సాంఘిక నాటకాన్ని ప్రదర్శించనున్నారు. రసఝురి–పొన్నూరు సమాజంచే ప్రదర్శించే ఈ నాటకాన్ని స్వర్గీయ గొల్లపూడి మారుతీరావు రచించారు. రంగస్థల/సినీ నటుడు వై.ఎస్.కృష్ణేశ్వరరావు దర్శకత్వం వహిస్తారు. కార్యక్రమ కరపత్రాన్ని శనివారం గాంధీనగర్‌లో ప్రముఖ సినీ మాటల రచయిత, కళల కాణాచి అధ్యక్షుడు డాక్టర్ సాయిమాధవ్ బుర్రా ఆవిష్కరించి, వివరాలను తెలియజేశారు. నాటక ప్రదర్శనకు ముందు ఆరు గంటలకు కళల కాణాచి ప్రధాన కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు అధ్యక్షతన జరిగే సభలో పట్టణానికి చెందిన వైద్య ప్రముఖుడు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తికి 'ప్రైడ్ ఆఫ్ తెనాలి' పురస్కారం ప్రదానం చేస్తారు. అజో–విభో–కందాళం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు అప్పాజోస్యుల సత్యనారాయణ పురస్కార ప్రదాతగా వివరించారు. చెరుకుమల్లి సింగారావు, ఎం.రామలింగేశ్వరుడు, కొండముడి రమేష్, బడుగు మోహనరావు, దేవరపల్లి భవాని పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసు దాడి

తెనాలిరూరల్: పేకాట శిబిరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. తెనాలి మండలం నేలపాడు పొలాల్లో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో రూరల్ ఎస్ఐ పి. కోటేశ్వరరావు తమ సిబ్బందితో శుక్రవారం రాత్రి పొద్దుపోయాక ఆకస్మిక దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.60,500 నగదు, సెల్‌ఫోన్‌లు స్వాధీనపర్చుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

రామాలయంలో అన్న సమారాధన



అన్నసంతర్పణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కృష్ణవేణి, మాధవి

తెనాలిఅర్బన్: శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా బోసురోడ్డులోని శ్రీ సీతారామ మందిరం వద్ద శనివారం సీతారామ అన్నదాన సేవా సంఘం ఆధ్వర్యంలో అన్న సంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సీఈవో పి.కృష్ణవేణి, జీఎం కె.మాధవి, బీజీఎం కె.జయలక్ష్మి, అన్నదాన కమిటీ అధ్యక్షులు దొప్పలపూడి శ్రీనివాస్ పాల్గొన్నారు. 42 ఏళ్ల నుంచి అన్నసంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వీరు తెలిపారు. కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. సుమారు 10 వేల మందికి అన్న సంతర్పణ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో బాలాజీ ప్రసాద్, ఎస్.శ్రీనివాసన్, శేషగిరి, పావులూరి నాగేశ్వరరావు, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై జాగరూకత అవసరం

ఆచార్య ఎన్జీ రంగా వీసీ డాక్టర్ శారద జయలక్ష్మి



శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న

గుంటూరు రూరల్: ఆరోగ్య పరిరక్షణపై ప్రతి ఒక్కరూ జాగరూకతతో వ్యవహరించాలని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఆర్ శారద జయలక్ష్మిదేవి సూచించారు. శనివారం లాంఫాం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో ఉద్యోగులకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఎండోలైఫ్ సూపర్ స్పెషాలిటి ఆసుపత్రి, కొనాక్ డయాగ్నస్టిక్స్ ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షణ విషయంలో రోజుకు గంటపాటు వ్యాయామం లేదా ఆటలైనా ఆడాలన్నారు. ఈ సందర్భంగా వైద్యులు సాయిబాబు, ప్రత్యూష, నజ్మ, సీఎస్ రావు, ఎస్ కిశోర్ కుమార్‌లు పరిశోధన కేంద్రంలోని బోధన, బోధనేతర సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ పీ సాంబశివరావు, డాక్టర్ శ్రీలక్ష్మి, డాక్టర్ శ్రీకాంత్, ఎమ్ సుమంత్, గోపిచంద్, అశోక్, దాల్మిక, కోటేశ్వరరావు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

కోనేటి చెరువులో నీటి నమూనా సేకరణ



పరీక్ష చేస్తున్న ఇంజినీరింగ్ అసిస్టెంట్లు

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని గ్రామానికి నీటి సరఫరా చేసే కోనేటి చెరువు వద్ద శనివారం ఇంజినీరింగ్ అసిస్టెంట్లు రామాంజనేయులు, గోపి, తయూబ్ నీటినమూనా పరీక్షలు చేశారు. ఈసందర్భంగా పంచాయతీ కార్యదర్శి కె.విష్ణువర్ధన్‌రావు మాట్లాడుతూ కొత్తగా సాగర్ జలాలు చెరువుకు వచ్చినందు వలన వాటిలో మలినాలు ఉన్నాయా లేవా అనేదానిపై నీటి నమూనా పరీక్షలు చేయించినట్లు తెలిపారు. ట్యాంకు వద్ద బ్లీచింగ్ కలిపిన నీరు క్లోరినేషన్ అయిన తరువాత దానిని పరీక్షించి సరి అయిననీరు అయినచో వాటిని గ్రామంలోకి సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. పీహెచ్‌యూ, హార్డ్‌నెస్, ఆల్‌కెనాలిటీ, ఫ్లోరైడ్, నైట్రేట్, ఐరన్, రెసిబుల్ క్లోరిన్ వంటి పరీక్షలు చేసి పరీక్షించిన తరువాత నీటిని గ్రామంలోకి వదులుతున్నట్లు ఆయన వివరించారు. ఆయన వెంట సర్పంచి మేడాబాబు ఉన్నారు.

హై రిస్క్ ప్రెగ్నెన్సీపై వైద్యాధికారులకు శిక్షణ

గుంటూరు మెడికల్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న మెడికల్ ఆఫీసర్‌లకు శనివారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఇంటిగ్రేటెడ్ హై రిస్క్ ప్రెగ్నెన్సీ మేనేజ్‌మెంట్ ప్రొటోకాల్స్‌పై శిక్షణ కార్యక్రమం జరిగింది. శిక్షణలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రతి గర్భిణీకి వైద్యాధికారి మాత్రమే బీపీ పరీక్ష చేయాలని చెప్పారు. బీపీ, షుగర్, థైరాయిడ్, రక్తహీనత పరీక్షలు నిర్వహించి తరచూగా వారికి ఆరోగ్యంపై మెలకువలు తెలియజేయాలన్నారు. హైరిస్క్ గర్భిణులను హెల్త్ విజిటర్ లేదా పబ్లిక్ హెల్త్ నర్సుకు ట్యాగ్ చేసి కాన్పును పర్యవేక్షించాలని చెప్పారు. ప్రతి ఆరోగ్య కేంద్రంలో తప్పనిసరిగా సేఫ్ డెలివరీ క్యాలెండర్‌ను ప్రదర్శించి కాన్పులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. డాక్టర్ చరణ్‌తేజ్, డాక్టర్ రేష్మ, డీపీహెచ్‌ఎన్‌ఓ శాంతకుమారి, హెచ్‌ఈఈఓ కె.పి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

బ్యాగు చోరీపై ఫిర్యాదు

గుంటూరు ఈస్ట్: ద్విచక్రవాహనానికి తగిలించిన బ్యాగు చోరీకి గురైన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. అరండల్‌పేట 3/2లైనులో ఈనెల 14వ తేదీ కరుణశ్రీ హ్యాండ్ బ్యాగును ద్విచక్ర వాహనానికి తగిలించి టిఫిన్ సెంటర్‌లోకి వెళ్లింది. తిరిగి వచ్చి చూడగా బ్యాగు కనిపించలేదు. బ్యాగులోని రూ.25 వేలు నగదు, రెండు సవర్ల బంగారు గొలుసు, స్థలం డాక్యుమెంట్లు ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు శనివారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

26లోగా పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోవాలి

తెనాలిరూరల్: ఎన్నికల విధులకు కేటాయించిన ఉద్యోగులు, సిబ్బంది తమ పోస్టల్ బ్యాలెట్ కోసం 26వ తేదీ సాయంత్రం లోగా దరఖాస్తు చేసుకోవాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెనాలి తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటరులో తమ ఎన్నికల విధుల ఆర్డర్ కాపీ, ఫారం–12, ఓటరు ఐడీ జిరాక్స్‌తో దరఖాస్తు అందజేయాలన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణం 15వ వార్డుకు చెందిన కె.హరికిషోర్ అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరరావు ఆయన మృత దేహానికి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు మట్టి ఖర్చుల నిమిత్తం రూ.5వేల నగదును అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఎం.ప్రభాకర్, వెంకట్రావు, కొండలు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

తెనాలిఅర్బన్: విద్యార్థులు పోటీ తత్వాన్ని అలవాటు చేసుకోవాలని నారాయణ విద్యా సంస్థల డీజీఎం శ్రీనివాసరెడ్డి, ఏజీఎం వెంకటేశ్వరరావులు పేర్కొన్నారు. పట్టణంలోని నారాయణ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో శనివారం ఏర్పాటు చేసిన గ్రాడ్యుయేషన్ డే వేడుకలను వారు ప్రారంభించారు. కార్యక్రమంలో కిట్స్ కోఆర్డినేటర్ ప్రతిభ, ప్రిన్సిపల్ వెంకట నాగరాజు, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

శ్రీ మహంకాళీ అమ్మవారి దేవస్థానము
కంఠంరాజు కొండూరు-522330, దుగ్గిరాల మండలం, గుంటూరు జిల్లా.

టెండరు ప్రకటన

గుంటూరు జిల్లా, దుగ్గిరాల మండలం, కంఠంరాజు కొండూరు గ్రామములో వేంచేసియున్న శ్రీ మహంకాళీ అమ్మవారి దేవస్థానమునకు ది.30-05-2024న నిర్వహించు శ్రీ అమ్మవారి 47వ వార్షిక మహోత్సవం సంబంధించి వివిధ అయిటములకు అనగా 1.హంస వాహన పూల డెకరేషన్స్, 2.జనరేటర్లు–4ఒకరోజుకు, 3.దేవస్థానముకు ప్రత్యేక లైటింగ్ 5 రోజులు మరియు గ్రామోత్సవము రోజున ప్రత్యేక లైటింగ్, 4.భోజనాలు–500మందికి, 5.TATA ACE- 8 ఆయిల్‌తో, 6.ప్రత్యేక సన్నాయి మేళం – 25మంది, 7.తాషాబకాలు–8మంది మొదలగు కార్యక్రమములకు సంబంధించి సీల్డు టెండరు కోరబడుచున్నవి. టెండరు షెడ్యూలు ది.24-04-2024 నుండి ది.03-05-2024 వరకు సాయంత్రం 5.00గం వరకు రూ.200/-లు చెల్లించి టెండరు ఫారము ను పొందవచ్చును. పూర్తి చేసిన టెండరు ఫారములు ది.05-05-2024 మధ్యాహ్నం 2.00గం॥లోపు స్వయముగా గానీ పోస్టల్ ద్వారా గానీ మా కార్యాలయమునకు చేరు విధముగా పంపవలెను. ఇతర వివరములకు కార్యాలయము పని చేయు వేళల యందు సంప్రదించగలరు.
ప్రదేశము: కంఠంరాజు కొండూరు గ్రామం, తేది: 20-04-2024

ఇట్లు, కార్యనిర్వహణాధికారి

